క్లుప్తంగా

నేడు తేరుమైదానంలో కబడ్డీ ఎంపికలు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని తేరుమైదానంలో గురువారం ఉదయం 10గంటలకు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, కార్యదర్శి అబ్రహాంలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే బాలబాలికలకు 16 ఏళ్లలోపు ఉండి, 55కేజీలోపు బరువు ఉండాలన్నారు. ఆసక్తి గల బాలబాలికలు ఒరిజినల్ ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమోలతో హాజరు కావాలని, ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



గద్వాల క్రైం: గద్వాల సీఐగా టాటబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యలపై వచ్చే బాధితులకు సత్వర న్యాయ పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా ఇసుక, మట్టి, మద్యం విక్రయాలు నిర్వహిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. వివిధ పోలీసుస్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల విచారణలో వేగవంతం చేస్తామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రత్యేక విభాగంలో విధులు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసులును వికారాబాద్ జిల్లా పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు.

ఎస్‌ఐగా శ్రీనివాసులు నాయక్

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్‌ఐగా మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట నుంచి శ్రీనివాసులు నాయక్ బదిలీపై ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇక్క డ ఉన్న ఎస్‌ఐ బాల్‌రాజు బల్మూర్‌కు బదిలీపై వెళ్లారు. అనంతరం నూతన పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయింపులో భాగంగా డీ బూడిదపాడులోని ఆర్డీఎస్ క్యాంపులో పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని బుధవారం ఏఆర్ డీఎస్పీ నరేందర్‌రావ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శ్రీనివాస్ నాయక్, బాల్‌రాజు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఎస్‌ఐని సన్మానించిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల నూతన ఎస్‌ఐ వెంకటేష్‌ను బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రుక్మాందర్‌రెడ్డి పీఎస్‌లో శాలువా, పూలబొకేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు జయపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనంతరెడ్డి, సూర్యకాంతారెడ్డి, రామచంద్రారెడ్డి, శాంతన్న, ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు వివరాల మేరకు.. సర్జాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్ అయ్యప్ప అనుమతి లేకుండా ఇసుకను సర్జాపురం నుంచి కొండాపురానికి తరలిస్తున్నాడు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు కొండాపురం శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యాజమాని అయ్యప్పపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

మండల అధ్యక్షుడి నియామకం

గద్వాల అర్బన్: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గద్వాల మండల అధ్యక్షుడిగా మండలంలోని పూడురుకు చెందిన మహేష్‌కు నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో మతపరమైన సభలా?

శాంతినగర్: జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మతపరమైన సభలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మతాలకు సంబంధించిన విద్యార్థులు చదువుకునే పాఠశాల ప్రాంగణంలో రెండు రోజులుగా ఓ మతానికి చెందిన సభలకు ఎవరు అనుమతి ఇచ్చారని, వారెలా పెడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి మతపరమైన సభలు పాఠశాల ప్రాంగణంలో పెట్టిన వారిపై, అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డి మాండ్ చేశారు.

కారు చోరీ

గద్వాల క్రైం: ఓ షెడ్డులో నిలిపిన కారు ఎత్తుకెళ్లిన ఘటన రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పర్వతాలు కథనం మేరకు.. వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్న నయాం తన కారును ఈ నెల 4వ తేదీన గద్వాల జమిచెడ్ శివారులోని షెడ్డులో పార్కింగ్ చేసి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూడగా కారు కనపడకపోడంతో చోరీకి గురైనట్లు అనుమానంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘మీ సేవ’లేక అవస్థలు

- మాన్‌దొడ్డిలో కేంద్రానికి ఎప్పుడూ తాళమే..
- చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
- ఆన్‌లైన్ సేవల కోసం 30 కి.మీ. ప్రయాణం
- అధికారుల తీరుపై మండిపాటు



మాన్‌దొడ్డిలో మూసి ఉన్న మీ సేవ కేంద్రం

రాజోళి: జననం నుంచి మరణం దాకా అన్ని ధ్రువీకరణ పత్రాలు అందించేది ‘మీసేవ’ కేంద్రాలు. ప్రతి ఆన్‌లైన్ సేవకోసం, ప్రభుత్వ పథకాల కోసం, వాటి దరఖాస్తుల కోసం ప్రతి చిన్నదానికి మీ సేవతో ముడిపడి ఉంది. మీ సేవలు అందుకునేందుకు మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామాలకు అందుబాటులో మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అది ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని పేర్కొంటున్నారు. మీ సేవ కేంద్రంలో పని ఉందంటే దాని కోసం రోజంతా సమయం మొత్తం వృథా అవుతోంది. 30 కి.మీ. ప్రయాణానికే సమయం వృథా కావడంతో పాటు, వృద్ధులు, దివ్యాంగులు ఎన్నో అవస్థలు పడుతున్నారు.

మాన్‌దొడ్డిలో మీ సేవ కేంద్రం ఏర్పాటు..

మండలంలోని పెద్దధన్వాడ, చిన్నధన్వాడ, నసనూరు, మాన్‌దొడ్డి, పచ్చర్ల గ్రామాలకు అందుబాటులో ఉండేలా మాన్‌దొడ్డిలో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేశారు. పెద్ద ధన్వాడ నుంచి రాజోళికి వెళ్లాలంటే దాదాపు 20 కి.మీ ప్రయాణం చేయాలి. రాను పోను 40 కి.మీ ప్రయాణం చేయాల్సిందే. మిగతా గ్రామాల పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. బ్యాంకుల్లో రుణాలు తీసుకునేందుకు, విద్యార్థులకు సర్టిఫికెట్లు తీసుకునేందుకు మాన్‌దొడ్డిలోని మీ సేవ కేంద్రం అందుబాటులో లేదు. దీంతో మండల కేంద్రం రాజోళి, శాంతిగనర్, అయిజ పట్టణాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. సమయం వృథాతో పాటు అదనంగా డబ్బు ఖర్చు అవుతోందని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అధికారులు అప్పట్లో మాన్‌దొడ్డిలో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేశారు. అది ఏర్పాటు చేసినప్పటి నుంచి వారంలో రెండు రోజులు కూడా అందుబాటులో ఉండడం లేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే రెండు రోజులు షాపు తెరుస్తారు, తర్వాత మళ్లీ మూసేస్తారు. విద్యార్థులు కాలేజీకి దరఖాస్తు చేసుకునేందుకు, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలకు, వృద్ధులు, దివ్యాంగులు, సదరం క్యాంపు, పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు, రైతులు బ్యాంకుల్లో రుణాల కోసం ఆర్‌ఓఆర్, పహణీల కోసం దూర ప్రాంతాల్లో ఉన్న మీ సేవ కేంద్రాలకు వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది.

అధికారుల చర్యలు శూన్యం

మాన్‌దొడ్డిలో ఉన్న మీ సేవ కేంద్రం నుంచి సేవలు అందడం లేదు. అసలు తెరవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. మీ సేవ కేంద్రం వల్ల ప్రజలకు ఎవరికి ప్రయోజనం లేదని చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికారులు వెంటనే స్పందించి మీ సేవ కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ యువతకు ఆ కేంద్రాన్ని అప్పగిస్తే వారికి ఉపాధి లభించడంతో పాటు, ప్రజలకు మీసేవ కేంద్రం ద్వారా సేవలు అందుబాటులోకి వస్తాయి.

ఆన్‌లైన్ సేవలకు 25 కి.మీ ప్రయాణం



మా గ్రామం నుంచి రాజోళి, శాంతినగర్‌కు వెళ్లాలంటే 25 కి.మీ మేర ప్రయాణించాలి. సర్టిఫికెట్ కావాలంటే పక్కనే ఉన్న మాన్‌దొడ్డి గ్రామాన్ని వదిలి ఇతర కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. మాన్‌దొడ్డిలో మీ సేవ అందుబాటులో ఉంటే గంటలోనే పని పూర్తి అవుతుంది. వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంది.

– ఎల్లప్ప, పెద్ద ధన్వాడ

అధికారులు పట్టించుకోవడంలేదు



ప్రజలకు సేవలు అందించేందుకు కేంద్రం ఏర్పాటు చేస్తే దాన్ని ఎప్పుడూ మూసుకుని ఉండటం వల్ల ఎవరికి ప్ర యోజనం లేదు. ఎప్పుడు కేంద్రం మూతబడే ఉంటుంది. ఇంతా జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. వెంటనే మీ సేవ వారి అనుమతి రద్దు చేయాలి.

– పకీరన్న, పెద్ద ధన్వాడ

చర్యలు తీసుకుంటాం



మాన్‌దొడ్డిలో ఉన్న మీ సేవ కేంద్రం ద్వారా ఆయా గ్రామాలకు సేవలు అందాల్సి ఉంది. కానీ ప్రజలకు సేవలు అందడం లేదని మా దృష్టికి వచ్చింది. పై అధికారులకు నివేదిక పంపి వెంటనే చర్యలు తీసుకుంటాం.

– జోషి శ్రీనివాస్ శర్మ, తహసీల్దార్, రాజోళి

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు



బుడమొర్సులో పరిశీలిస్తున్న ముషాహిదాబేగం



మానవపాడులో పరిశీలిస్తున్న రమణారావు

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ప్రత్యేకాధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. వడ్డేపల్లి మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వివిధ పనులు చేపట్టారు. జిల్లెడుదిన్నె ప్రత్యేకాధికారి ఎంపీడీఓ రవీంద్ర మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 15 వరకు పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తొమ్మిది రోజుల్లో గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. బుడమొర్సులో మండల ప్రత్యేకాధికారి ముషాహిదా బేగం పాల్గొని పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు తిరుపతన్న, కార్యదర్శులు నాగరాజు, జ్ఞానేశ్వరి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

మానవపాడు: మండల కేంద్రంలో ప్రత్యేక పారిశుద్ధ్యంలో భాగంగా ఎంపీడీఓ రమణారావు ఆధ్వర్యంలో పరిసరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా పొడిచెత్త, తడిచెత్త వేరు చేయాలని ఆదేశించారు. గ్రామంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. తాగునీటి విషయంలో అలసత్వం వహించకుండా ప్రతి ఒక్కరికీ నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ రాఘవ అన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 15 వరకు చేపట్టిన ప్రత్యేక పారిశు ద్ధ్య కార్యక్రమంలో భాగంగా ఎర్రవల్లి మండలంలోని వేములను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేష్‌కుమార్ ఉన్నారు.

ప్రత్యేకాధికారుల పర్యటన

అయిజ: మండలంలోని యాపదిన్నె, కుర్వపల్లి గ్రామాల్లో ప్రత్యేకాధికారి శంకర్‌లాల్ పర్యటించారు. రోడ్లపై మురుగు నిలిచి ఉందని, డ్రెయినేజీలో మురుగు పేరుకు పోయిందన్నారు. రోడ్లకు మరమ్మతు చేసి మురుగు నిలువకుండా చూడాలని, మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో యాపదిన్నె గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కురువపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తులసీ కుమార్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీస్ ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు

గద్వాల అర్బన్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో అధికారికి ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె నోటీస్‌ను అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న చేపట్టబోయే సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాధమ్మ, శేషమ్మ, పరిమళ, మల్లేశ్వరి, గోవిందమ్మ ఉన్నారు.

జీపీ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ వర్కర్లను పర్మినెంట్ చేయాలని గ్రామ పంచాయతీ కార్మిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌టీయూ అనుబంధ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టబోయే సమ్మె నోటీస్‌ను గద్వాల మండల ఎంపీడీవో కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, శేఖర్, ఆంజనేయులు ఉన్నారు.

విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టిపెట్టాలి



కేజీబీవీలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శివాని

ఎర్రవల్లిచౌరస్తా: విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శివాని అన్నారు. గురువారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు భరోసా సెంటర్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరోసా టీమ్ సభ్యులు మొబైల్ వినియోగం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చదువు ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, డయల్100, చైల్డ్ హెల్ప్‌లైన్1098, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ శివాని మాట్లాడారు. ఎక్కడైనా విద్యార్థులు లైంగిక వేధింపులకు గురైతే భరోసా సెంటర్ 6303923257కు సమాచారం ఇచ్చి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీ రత్నమాల, భరోసా సిబ్బంది ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



గద్వాల: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు చక్కటి బోధన చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం ఇమ్మాయేల్ బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఆడి, పాడి సందడి చేశారు.

ఆలయానికి విరాళం

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో బుధవారం బాలయోగి శివనారాయణస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళంగా పెద్ద వెంకటస్వామి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు సహకరించండి

అలంపూర్: విద్యుత్ మీటర్ రీడర్‌కు వచ్చే విద్యుత్ ఉద్యోగులకు సహకరించాలని విద్యుత్ ఏడీఈ చిన్న మక్బుల్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతి పథకం కోసం వినియోగదారుల నుంచి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు మొబైల్ నెంబర్ వంటి వివరాలు ఇచ్చి సహకరించాలని సూచించారు.

శిశు మరణాలు లేకుండా చూడాలి

గద్వాల క్రైం: శిశు మరణాలు లేకుండా వైద్యులు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జీ వైద్యాధికారిణి శశికళ అన్నారు. బుధవారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణులకు పోషకహారం, తీసుకోవాల్సిన జాగ్రతలు చెప్పాలన్నారు. శిశు మరణాలు లేకుండా సిబ్బంది సమిష్టి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అనురూప, నర్సింహులు, స్రవంతి, ప్రసూన, రామాంజనేయులు ఉన్నారు.

ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు

అయిజ: మండలంలోని యాపదిన్నెలో బుధవారం లక్ష్మీశ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ వారు ఉజ్వల పథకం కింద పేద ప్రజలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా సిలిండర్, స్టవ్‌లను పంపిణీ చేశారు. పేద ప్రజలకు ఎక్కువ కనెక్షన్లు ఇచ్చేందుకు కృషి చేసిన లక్ష్మీశ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ ఆర్గనైజర్ రామ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

అయిజ: దేశం ప్రపంచంతో పోటీపడి అభివృద్ధి చెందుతుందని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర బీజేపీ మైనార్టీ మోర్చ అధ్యక్షుడు అఫర్‌పాషా అన్నారు. మండలంలోని సింధనూరులో బుధవారం బీజేపీ నాయకులు నిర్వహించిన గావ్ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీవీపల్లి గ్రామానికి చెందిన ఏఫోన్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

ప్రతి అధికారి అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మరియమ్మ

రాజోళి: మండలంలోని గ్రామాల్లో ప్రతి అధికారి అందుబాటులో ఉండాలని ఎంపీపీ మరియమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాలకు ప్రత్యేకాధికారులను కేటాయించారని, ఆ అధికారి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండలంలోని ముండ్లదిన్నె, తుమ్మిళ్ల, రాజోళి తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలున్నాయని, స్తంభాలు, తీగలు ఏర్పాటు కోసం ఎన్నో ఏళ్లుగా చెబుతున్నా, అవి పరిష్కారం కాలేదని సభ్యులు తెలిపారు. కుక్కకాటుకు టీకాలు రాజోళి పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయన్నారు. రాజోళి మండలానికి చెందిన కస్తూర్బా పాఠశాలను ఇతర మండలానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పటికే రాజోళికి చెందిన కస్తూర్బా పాఠశాల వడ్డేపల్లిలో కొనసాగుతుందన్నారు. రాజోళిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎంపీపీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, ఎంపీడీఓ గోవిందురావ్ పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



అయిజలో నివాళులర్పిస్తున్న అఖిలపక్షం కమిటీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్ష కమిటీ సభ్యులు బుధవారం రమాబాయి 126వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రమాబాయికి చిన్నతనంలోనే అంబేద్కర్‌తో వివాహమైందని, ఎన్ని కష్టాలు ఎదురైనా విధేయతతో భార్యగా, జీవిత భాగస్వామిగా, ఆదర్శ ప్రాయంగా జీవించిందని కొనియాడారు. అంబేద్కర్ ఎదుగుదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఆంజనేయులు, విజయభాస్కర్‌రెడ్డి, మారెప్ప, కృష్ణయ్య, రాజు, అంజి, లెనిన్, కార్గిల్, ప్రసాద్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ధరూరు: గ్రామీణ ప్రాంతాల్లో జరిగే క్రీడలు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని, క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని బీఆర్‌ఎస్ నాయకులు అవినాష్ రెడ్డి అన్నారు. మండలంలోని నాగర్‌దొడ్డిలో జరిగిన ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుతులు అందజేశారు. ప్రథమ బహుమతిని గోపాల్ టీం రూ.5016 నగదు గెలుచుకుంది. రెండో బహుమతిగా నరేష్, ప్రభాకర్ టీం రూ.3016, మూడో బహుమతిని మునీంద్ర టీం కై వసం చేసుకుని రూ.2016 నగదును గెలుచుకుంది. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఉసేనమ్మ, ఎంపీటీఈ తిప్పమ్మ, నాగర్‌దొడ్డి వెంకట్రామిరెడ్డి, భీంరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు వినియోగించుకోవాలి



ఆలూరులో అంగన్‌వాడీ కేంద్రంలో సేవల గురించి తెలియజేస్తున్న కార్యదర్శి, ఏఎన్‌ఎంలు

గట్టు: అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి తిమ్మయ్య, ఏఎన్‌ఎం భారతి కోరారు. బుధవారం ఆలూరు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సమావేశంలో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు రక్తహీనత నుంచి బయట పడాలని, సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పోషణ లోపాలను నుంచి బయట పడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇందిర, ఆశా కార్యకర్తలు ఉరుకుందమ్మ, గోవిందమ్మ, సహాయకురాలు లలిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసిన చారిటబుల్ ట్రస్ట్ రత్నసింహారెడ్డి



ధరూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు అందిస్తున్న ఎంఈఓ సురేష్

కేటీదొడ్డి: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలని హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రత్నసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని విద్యార్థులకు తమ వంతుగా ఎంఈఓ సురేష్, రత్నసింహారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్ను, పెన్సిల్, హాల్‌టికెట్ పౌచ్, తదితర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ భీమన్న, ట్రెజరీ కృష్ణవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాగుంటన్న, రాఘవ, వెంకటేశ్వర్‌గౌడు ఉన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఈఓ సురేష్, ట్రస్టు అధ్యక్షులు రత్నసింహారెడ్డి, పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కీ.శే. నైబాయి అనంతమ్మ, వేమారెడ్డిల జ్ఞాపకార్థం సేవ కార్యక్రమాన్ని చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణవర్ధన్ రెడ్డి, హీమ్ను, శ్రీకాంత్, మమత పాల్గొన్నారు.

రోడ్లపై జాగ్రత్తగా నడుచుకోవాలి



రాజోళి: పాఠశాలకు వచ్చేటప్పుడు, ఇంటికి వెళ్లేటప్పుడు రోడ్లపై జాగ్రత్తగా నచుకోవాలని ఎస్‌ఐ జగదీశ్వర్ అన్నారు. మండల కేంద్రంతో పాటు ముండ్లదిన్నెలో ఆయన రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వాహనాలను తీసుకుని రోడ్లపైకి రావడం, విచక్షణా రహితంగా డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు కారకులవుతారని, వాటి వల్ల కుటుంబాల్లో జరిగే అనర్థాలకు బాధ్యులవుతారని అన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ఒక కుటుంబం ఎంత బాధపడుతుందో తెలుసుకుని డ్రైవింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com